


'గులాబీ'కి మరో దెబ్బ!



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలోనూ బీఆర్ఎస్ ఓటమి
- గతంలో ఇదే స్థానంలో నాలుగు సార్లు విజయం
- ఇటీవలి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కుదేలు
- కంచుకోటలో వరుస పరాజయాలతో కేడర్ పక్కచూపులు
- తొలిసారిగా పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ పాగా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నిన్నమొన్నటి వరకు బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న పోరుగల్లు.. ఓరుగల్లులో ఆ పార్టీకి మరో దెబ్బ తగిలింది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వరుస ఓటములు చవిచూసిన ఆ పార్టీకి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ పరాభవం తప్పలేదు. దాంతో కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలు బీటలు వారుతుండం.. వరుస పరాజయాలు ఎదురవుతుండటంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్న గులాబీ కేడర్ పక్క చూపులు చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే లోక్‌సభ ఎన్నికల్లో పరాజయంతో తీవ్ర నిరాశలో ఉండగా.. నాలుగు పర్యాయాలు విజయం సాధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ ఓటమి చవిచూడడాన్ని ఆపార్టీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. తమకు గట్టి పట్టున్న ఓరుగల్లులో పార్టీ బలహీన పడుతుంటే అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టడం లేదనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు కీలక నేతలు కారు దిగేందుకు రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. కొందరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లినట్టుగా సమాచారం.

పరాజయాలతో గులాబీ పరేషాన్

తెలంగాణ ఉద్యమంలో అండగా నిలిచిన పోరుగడ్డ ఓరుగల్లులో బీఆర్ఎస్‌కు వరుస ఓటములు మింగుడు పడటం లేదు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే విజయం సాధించారు. అంతేకాకుండా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను గెలుచుకుని బలమైన పార్టీగా ఆవిర్భవించింది. నాటి పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నుంచి కీలకమైన నేతలు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరారు. లీడర్, కేడర్‌తో బలంగా ఉన్న బీఆర్ఎస్ 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీ ఛైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలుచుకుని బలమైన శక్తి బీఆర్ఎస్ ఎదిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బలమైన రాజకీయ పక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కష్టకాలం మొదలైందనే చర్చ జరుగుతోంది. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో కేవలం జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లోనే బీఆర్ఎస్ గెలిచింది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. దీంతోపాటు పార్లమెంట్ ఎన్నికల వేళ స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కారు దిగి హస్తం గూటికి చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన కూతురిని కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దించి ఎంపీ గా గెలిపించుకున్నారు. కడియంతో పాటు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సైతం బీజేపీలోకి వెళ్లారు. డీసీసీబీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఎవరికివారు కాంగ్రెస్ లో చేరారు. వీరితో పాటు కీలక నేతలు చాలా మంది కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. ఈ నేపథ్యంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా హనుమకొండ జడ్పీ ఛైర్మన్ సుధీర్‌కుమార్‌ను బరిలో దించగా ఆయన మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఏ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ తన ప్రభావాన్ని చూపలేకపోయింది. పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో కొన్ని ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మిగతా ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగానే పోలింగ్ జరిగింది. బీఆర్ఎస్ మూడోస్థానానికి పరిమితం కావటంతో అప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఉన్న కేడర్‌కు మింగుడు పడకుండా తయారైంది. మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసిన మాలోతు కవితకు కూడా ఏ అసెంబ్లీ నియోకవర్గంలోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయారు. ఇక్కడ బీజేపీ బలంగా లేకపోవటంతో బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవటం కొంత ఉపశమనంగా భావిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీల్లో ఒక్కటి కూడా గెలవకపోవడం కేడర్‌లో నిరాశను నింపింది.

పట్టభద్రుల ఝలక్‌తో మరింత కుదేలు..

గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లోనూ ఎదురుదెబ్బలు తప్పటం లేదు. 2009 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలిచిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పట్టు నిలుపుకోలేకపోయింది. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఉద్యమ సమయంలోనే కాకుండా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వైపు నిలిచిన పట్టభద్రులు కాంగ్రెస్, బీజేపీలకు అవకాశం లేకుండా చేశారు. నాలుగు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థులకే పట్టం కట్టారు. అయితే గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లారాజేశ్వరరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఈ సిట్టింగ్ స్థానంలో తిరిగి గెలవాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలో దించింది. అయినప్పటికి రెండో ప్రాధాన్యత ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. దీంతో ఈ స్థానంలో తొలిసారి కాంగ్రెస్ పాగా వేసింది. కాగా, ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో ఉన్న గులాబీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటమి మరింత కుంగతీస్తోంది.

గులాబీ నేతల పక్కచూపులు..?

వరుస ఓటములతో రాజకీయ భవిష్యత్‌పై కొందరు నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్, బీజేపీల్లో చేరిపోయారు. చాలామంది నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై అభిమానం.. ఉద్యమం నుంచి వచ్చిన పార్టీ అన్న భావనతో కొనసాగుతున్నారు. కానీ తమ భవిష్యత్ దృష్ట్యా కొందరు పక్కచూపులు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్‌లో ఎంపీల ప్రమాణస్వీకారం తరువాత బీఆర్ఎస్ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఉమ్మడిజిల్లా ముఖ్యనేతలు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితోనే మంతనాలు చేస్తుండగా, మరికొందరు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పార్టీలో చేరే విషయమై చర్చలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని, ఇప్పటికే కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరనుండటం, రాష్ట్రంలో కాంగ్రెస్ వర్సెస్

మిగతా 6వ పేజీలో..

విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి : కలెక్టర్

మహబూబాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తివిత్తన దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, అధికారులను ఆదేశించారు. వానాకాలానికి సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీంలు (వ్యవసాయశాఖ అధికారి, పోలీస్‌అధికారి, రెవె న్యూ అధికారి)గా ఏర్పాటు చేసి విత్తన దుకాణాలను తరుచుగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో ఉన్న డీలర్లు నియమ నిబంధనలు పాటిస్తూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, నిబంధనలు పాటించని విత్తన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వానాకాలం సీజన్‌కు సరిపడ విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. విత్తన సరఫరా ఎక్కడా ఇబ్బంది లేకుండా సక్ర మంగాజరిగేటట్లు చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడును ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నేటి సీఎం ముఖాముఖికి విద్యార్థిని నిఖిత



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 8 : హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమంలో విద్యార్థినీ లావుడ్య నిఖిత పాల్గొనన్నుట్లు ప్రధానోపాధ్యాయుడు పూజారి వీరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీ వార్షిక పరీక్ష ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన నిఖిత ముఖ్యమంత్రితో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు వివరించారు. విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడు పాల్గొనన్నుట్లు తెలిపారు, అనంతరం 10న హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇతర రాష్ట్ర అధికారులు విద్యార్థి నిఖితతో పాటు తల్లిదండ్రులు, హెచ్ఎంను సన్మానించి వందే మాతరం విద్యాదాత పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని నిఖిత రేవంత్‌రెడ్డితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఎంఈవో ఫూల్‌చంద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ మంజుల, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం

- నేటి ఎగ్జామ్‌కు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో 12 సెంటర్లు, హాజరుకాన్నున 4,412 మంది అభ్యర్థులు
- సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ



గ్రూపు-1 పరీక్ష జరిగే మానుకోటలోని ఓ పరీక్ష కేంద్రం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 8 : జిల్లాలో ఆదివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా నేటి జరిగే ఎగ్జామ్‌కు మానుకోట పట్టణంలో 07, తొర్రూరులో 05 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్‌లలో జిల్లా వ్యాప్తంగా 4,412 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలేత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద వైద్యసిబ్బంది, తాగునీరు, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు.

ఉదయం 10.00 గంటల వరకే అనుమతి

గ్రూప్-1 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 9 గంటల నుంచి అనుమతిస్తారని, ఉదయం 10 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబడదని అధికారులు పేర్కొంటున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ప్యాడ్‌లు, మొబైల్‌ఫోన్లు, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు హాల్ టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదేని ఒక ఒరిజినల్ కార్డులను వెంటతీసుకుని రావల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రానికి కేవలం చెప్పులతో మాత్రమే హాజరు కావాలనే నిబంధన పాటించాల్సి ఉంది. ఓఎంఆర్ షీట్‌లో పరీక్ష రాయాల్సి ఉంటుందని, దానిని నింపడానికి బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలి. పరీక్ష నిర్వాహణ పర్యవేక్షణకు ఒక్కొక్క కేంద్రానికి ఒక్కో సూపరిండెంటెంట్ చొప్పున 12 మందిని నియమించారు. వీరితో పాటు రూట్ ఆఫీసరు, బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లు విధులు నిర్వహించనున్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

జిల్లాలో గ్రూప్-1 పరీక్షలకు 4,412 మంది అభ్యర్థులు హాజరు కానుండగా 12 సెంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో మహర్షి విద్యాలయం, నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్, ఎస్వీ విద్యాలయం, శ్రీచైతన్య టెక్నోస్కూల్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ (జి), ఫాతిమా హైస్కూల్, తొర్రూరులోని సెయింట్ పాల్ హైస్కూల్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ, ఆర్యభట్ట హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సమత డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలి : కలెక్టర్

జిల్లాలో నేడు (ఆదివారం) జరగనున్న గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం గ్రూప్-1 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఏగ్జామ్ కు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత పరీక్ష సమయానికంటే గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది సెల్‌ఫోన్‌లు తీసుకువెళ్లకూడదని తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెంబర్ : 79950 74803ను అందుబాటులో ఉంచారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్: ఎస్పీ

జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాల వద్ద గూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచారు. ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించనున్నారు. బయోమెట్రిక్ ఇన్విజిలెటర్లుగా 32 మందిని, చెకింగ్ స్క్వాడ్ 53 మందిని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు ఒకటి లేదా రెండు పరీక్ష కేంద్రాల వద్ద ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంచారు.

ఆరుద్ర పురుగులొచ్చేశాయ్

- రైతుల కళ్లల్లో ఆనందం



గూడూరు, జూన్ 8 : ఆరుద్ర కార్తె పేరు వినగానే మొదట గుర్తుకు వచ్చేది.. ఆరుద్ర పురుగులే! వాతావరణం చల్లబడి తొలకరి జల్లులు కురియగానే నల్లని నేలపై ఇవి ఎర్రని బొట్లుగా మెరుస్తూ కన్పిస్తాయి. వర్షాలు కురుస్తుండడంతో ఈ మృగశిర కార్తెలోనే ఆరుద్ర పురుగులు నేలపై తిరుగుతూ.. గూడూరు మండలం మచ్చర్ల పోడు భూముల్లో సందడి చేస్తున్నాయి. రైతులకు ఆనందం కలిగిస్తున్నాయి. ఇటీవల రైతులు సాగు భూముల్లో విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వేయడంతో ఆ పురుగులు అంతరించిపోయాయి. మునుపటి మాదిరిగా ఎక్కడ పడితే అక్కడ ఆరుద్ర పురుగులు కన్పించడం లేదు.

కక్షిదారులు రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్



జిల్లా కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న చంద్రశేఖర ప్రసాద్

మహబూబాబాద్ రూరల్, జూన్ 8 : కక్షిదారులు రాజీమార్గం ద్వారా తమతమ కేసులను వెంటనే పరిష్కరించుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ జిల్లా కోర్టులో రోడ్డు ప్రమాదాల కేసులు, భార్యాభర్తలకేసులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోనే కేసులు కాకుండా పరిష్కరించుకోవాలన్నారు. కేసుల ద్వారా కోర్టుచుట్టూ తిరగడంతో మానసిక ప్రశాంతత కోల్పోవడంతో పాటు ఆర్థికభారం, కాలంవృథా అవుతుందన్నారు. మనుషులు తప్పులు చేయడం సహజమని, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. మైనర్ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వ కూడదన్నారు. ఆటోదారులు తమ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూ రెన్స్ చేయించుకోవాలని చెప్పారు. ఈలోక్ ఆదాలత్‌లో మొత్తం 1,171 కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, జడ్జిలు తిరుపతి, మౌనిక, డీఎస్పీ తిరుపతిరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సత్వర సమస్యల పరిష్కారం కోసమే లోక్ అదాలత్‌లు

తొర్రూరు : కక్షిదారుల సత్వర సమస్యల పరిష్కారం కోసమే లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవా సమితి ఛైర్మన్, తొర్రూరు మునిసిఫ్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. పెట్టి కేసులు 1227, సీసీ కాంప్రమైజ్ 17, సీసీ అడ్మిషన్ 15, కుటుంబ తగాదాలు 2, జేసీఎన్ఐ 1, సివిల్ కేసు 1, పీఎల్‌సీ కేసులు 2, ఎక్సైజ్ కేసులు 57లను పరిష్కరించి రూ.2లక్షల 85వేల జరిమానా విధించామన్నారు. లోక్ అదాలత్‌లలో సమస్యల సత్వర పరిష్కారంతో పాటు కక్షిదారులు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు గణేష్ ఆనంద్, వి.మహేష్, బి.వెంకటేష్, సైదులు, కోర్టు పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానుకోటలో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

చేపలు పిరం

- మృగశిర చేపకు మస్తు డిమాండ్
- భారీగా విక్రయాలు, రెట్టింపైన ధరలు
- ఎగబడి కొనుగోలు చేసిన ప్రజలు
- ఒక్కరోజే 700 క్వింటాళ్లు అమ్మకం

8

రేపటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి ఇంజనీరింగ్ కళాశాలల్లో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ఈసెట్-2024 కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని వరంగల్ జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు వారి వారి సమయానుసారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

‘గులాబీ’కి మరో దెబ్బ!

(5వ పేజీ తరువాయి)

బీజేపీ అన్నట్టుగా రాజకీయాలు మారబోతున్నాయన్న అంచనాల నడుమ బీజేపీలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు హైదరాబాద్‌లో కాషాయ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. వచ్చే 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతందని, రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 119 నుంచి 175కు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ముందుగానే గోడ దూకి అసెంబ్లీ సీటుపై కర్చీఫ్ వేసుకోవాలనే ఆలోచనలో కొందరు గులాబీ నేతలు పక్కచూపులు చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. మొత్తానికి వరుస ఓటములు గులాబీ పార్టీకి కష్టకాలాన్నితెచ్చి పెట్టాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఈ కష్టకాలం నుంచి గట్టెక్కేందుకు గులాబీ బాస్ ఎలాంటి అడుగులు వేస్తారనేది ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

గృహిణి అదృశ్యం

వరంగల్ క్రైం, జూన్ 8: కూతురితో కలిసి మాధవి అనే గృహిణి అదృశ్యమైన సంఘటన కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లో పెద్దకాసు శ్రీశైలం, మాధవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల కూతురు ఉంది. ఈనెల 6వ తేదీన మాధవి(26) తన కూతురుతో కలిసి ఇంట్లో సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో రెండు రోజుల పాటు వెతికిన శ్రీశైలం.. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రతీ సారి ఇదే తంతు

దొరికితేనే బయటపడుతున్న దొంగలు ● మూల్యాంకనంలో కొరవడిన నిఘా
అక్రమార్కులకు అందివస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8 : కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్న ప్రతీసారి జవాబు పత్రాలు బయటకు వెళుతున్నట్లు వర్సిటీ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ జరుగుతున్నప్పుడు నిఘా కొరవడుతుండటంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ క్యాంపులోకి ప్రైవేటు వ్యక్తులను దినసరి కూలీలను తీసుకుంటున్న కేయూ అధికారులు.. వారిపై పర్యవేక్షణ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతోనే వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. స్పాట్ క్యాంపులకు 25 మంది డెయిలీ వేజెస్ కింద నియమించుకుంటున్నారు. కోడింగ్ జరుగుతున్న క్రమంలో వారు పేపర్ బండిళ్లలోని పేపర్లను మాయం చేస్తూ బయటకు పంపిస్తున్నారు.

ఇందుకు ఒక్కో పేపర్‌కు రూ.5వేల నుంచి 10వేలు వసూల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిని అధికారులు గుర్తిస్తే తప్ప దొంగలు బయటపడటం లేదు. ప్రతీసారి స్పాట్ క్యాంపు నుంచి జవాబు పత్రాలు బయటకు తీసుకెళుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల తోడ్పాటు లేకుండా జవాబు పత్రాలు బయటకు ఎలా వెళ్లుతాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేస్తేనే అసలు నిజాలు బయట పడుతాయనే అభిప్రాయాలను వర్సిటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నిఘా వైఫల్యం.. పర్యవేక్షణ శూన్యం..

పరీక్షల విభాగంలోని స్పాట్ క్యాంప్‌ల్లో అధికారుల నిఘా వైఫల్యంతోనే తరుచూ జవాబు పత్రాలు బయటకు వెళుతున్నాయి. దినసరి వేతనం కింద నియమిస్తున్న ప్రైవేటు వ్యక్తులపై అధికారుల పర్యవేక్షణ శూన్యం కావడంతో వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. స్పాట్ క్యాంపుల్లో 25 మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పనులు చేస్తున్నారు. వీరంతా రోజుకు రూ.260 చొప్పున పనిచేస్తున్నారు. కోడింగ్ సమయాల్లో వీరిపై నిఘా కొరవడటంతో జవాబు పత్రాల బండిళ్లు తీస్తున్నప్పుడు వాటిల్లో నుంచి ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాలను తీసుకెళ్లి వారికి అందజేస్తున్నారు. వారు మళ్లీ జవాబులు రాసేందుకు అడిషనల్ పేపర్లు ఇచ్చి వారితో రాయించి ఆ పేపర్లను తిరిగి బండిళ్లలో సర్దుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులకు మాత్రం కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నిఘా నేత్రానికి దొరికితేనే దొంగలు

సీసీ కెమెరాల ఫుటేజీలో చూస్తేనే తప్ప.. దొంగలు బయట పడటం లేదు. నిరంతరం నిఘా ఉంచాల్సిన జవాబు పత్రాలు బయటకు వెళుతుంటే అధికారులకు మాత్రం కనిపించడం లేదు. రెగ్యులర్ ఉద్యోగుల భద్రతలో ఉండాల్సిన విద్యార్థుల భవితవ్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పరిహాసం అవుతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు బయట పడినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప.. అసలు సంఘటనలు జరుగకుండా పూర్తి స్థాయి భద్రత చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిఘా వైఫ్యలం, పర్యవేక్షణ కొరవడటంతోనే అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ డబ్బులు దండుకుంటున్న వారిపై నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

11 మంది.. 25 పేపర్లు..

కేయూలో జరిగిన సంఘటనలో మొత్తం 25 జవాబు పత్రాలు మార్పిడీ జరిగినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు.. మరో 8 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారిపై కేసు నమోదు చేశారు.

లెక్కతేలిన పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్

1,098 ఎల్పీ పోస్టులు, 265 పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో చేపడుతున్న భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ లెక్క తేలింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,231 భాషా పండితుల పోస్టులు ఉండగా, అందులో 1,098 పోస్టులు స్కూల్ అసిస్టెంట్(భాష) పోస్టులుగా ఉన్నతీకరణ కానున్నాయి. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 321 పీఈటీ పోస్టులు ఉండగా, అందులో 265 పోస్టులు పీడీలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,363 పోస్టులు అప్‌గ్రేడ్ కానున్నట్లు విద్యాశాఖ వివరాలు వెల్లడించింది.

తెలుగు భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	128	114
హనుమకొండ	103	92
జనగామ	115	102
జయశంకర్ భూపాలపల్లి	75	67
మహబూబాబాద్	149	133
ములుగు	57	51

హిందీ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	119	106
హనుమకొండ	108	96
జనగామ	111	99
జయశంకర్ భూపాలపల్లి	76	68
మహబూబాబాద్	126	112
ములుగు	57	51

ఉర్దూ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	2	2
హనుమకొండ	4	4
జనగామ	1	1

పీఈటీ అప్‌గ్రేడేషన్ ఇలా...

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	72	59
హనుమకొండ	74	61
జయశంకర్ భూపాలపల్లి	37	31
జనగామ	58	48
మహబూబాబాద్	58	48
ములుగు	22	18

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలను తాత్కాలింగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలను తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో తర్వాత ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

పచ్చిరొట్ట అవకతవకలపై జాయింట్ విచారణ


రైతు వెంగళి సోమయ్యను విచారిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

తొర్రూరు రూరల్, జూన్ 8 : మండలంలో పచ్చిరొట్ట విత్తనాలపై అవకతవకలు జరిగిన విషయంపై ఏవో కుమార్, ఏఈవోలు సస్పెండ్ అయిన విషయం విదితమే. అయితే ఈ విషయంపై జిల్లా కలెక్టర్ మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు ఆదేశించారు. దీంతో శనివారం ఆర్డీవో నర్సింహారావు ఆధ్వర్యంలో జాయింట్ విచారణ చేపట్టారు. ఈ మేరకు మండలంలోని అమ్మాపురం, కొత్తగూడ, జమస్థాన్‌పురం, గుర్తూర్ గ్రామాల్లోని రైతుల వద్దకు స్వయంగా తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎస్సై జగదీష్, ఏడీఏ శోభన్‌బాబు వెళ్లి విత్తనాలపై ఆరా తీశారు. విత్తనాలు తీసుకోకుండానే తీసుకున్నట్లుగా రికార్డులో నమోదు చేశారని వెల్లడించారు. ఈ విషయంపై ఆర్డీవో నర్సింహారావును వివరణ కోరగా.. ఆగ్రోస్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి, జిల్లా అధికారులకు పూర్తి నివేదిక అందజేస్తామన్నారు.

'అన్యాయంగా సస్పెండ్ చేశారు'..

మహబూబాబాద్ అగ్రికల్చర్ : పచ్చిరొట్ట విత్తనాల ఘటనలో ఏఈవోలపై తప్పుడు నివేదికను మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు ఉన్నతాధికారులకు సమర్పించి, ఏఈవోల సస్పెండ్ కారణమయ్యారని ఏఈవోల గ్రాడ్యుయేట్ సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల సుమన్, సస్పెండైన తొర్రూరు మండల ఏఈవోలు అరవింద్, దీపిక, జమున ఆరోపించారు. మానుకోటలోని కలెక్టరేట్ ఎదుట వారు మాట్లాడారు. విత్తనాల అమ్మకంలో, తమకు సంబంధంలేని విషయంలో సస్పెండ్ చేయడం జరిగిందని, ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేసి సరైన విచారణ చేపట్టి ఏఈవోలకు న్యాయం చేయాలని కోరారు. కాగా, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

11న శ్రీముసలమ్మ జాతరలో వేలం పాట

కొత్తగూడ, జూన్ 8 : ఈనెల 11న గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరలో వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఈవో భిక్షమాచారి తెలిపారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ జాతరలో ఈనెల 11న కొబ్బరికాయలు, ఫొటోలు, పూజాసామగ్రి అమ్ముకునే హక్కు, తలనీలాలు సేకరించుకునే హక్కుకోసం వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఆదివారం (నేడు) జాతరలో టెండర్ ఫారాలు తీసుకోవాలని సూచించారు. 11న బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

మిని గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

కొత్తగూడ, జూన్ 8 : గోవిందాపురంలోని బాలికల మిని గురుకులంలో 1, 2, 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తరగతిలో 30 సీట్లు, 2వ తరగతిలో 2 సీట్లు, 5వ తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 1వ తరగతిలో ప్రవేశానికి 6 సంవత్సరాలు నిండిన ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 10 నుంచి 18 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 83672 19355 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

దాశరథి రంగాచార్యుల వర్ధంతి

చిన్నగూడూరు, జూన్ 8 : మండల కేంద్రంలోని దాశరథి సెంటర్‌లో శనివారం రంగాచార్యుల వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ప్రెస్‌క్లబ్ సభ్యులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు గాడిపెల్లి శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ సమాజాన్ని తన పదునైన రచనలతో మేల్కొలిపిన అక్షరయోధుడు దాశరథి రంగాచార్యులని కొనియాడారు. శ్రీపాల్, మోసిన్, సాంబయ్య, ప్రవీణ్, శ్రీనువాస్, నాగన్న, నరేష్ ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మరిపెడలోని 2000-01 టెన్త్‌క్లాస్ పూర్వ విద్యార్థులు

మరిపెడ, జూన్ 8 : మరిపెడలోని శ్రీరాఘవ విద్యానికేతన్ 2000-01టెన్త్ క్లాస్ విద్యార్థులు శనివారం ఆ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల క్రితం ఒకరికి ఒకరు విడిపోయి ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ ఒకరికి ఒకరు కలుసుకొని వారివారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చేదు అనుభవాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకొన్నారు. అప్పటి గురువులు అబ్బయ్య, రాజేందర్, నరేందర్, వెంకోబా, సురేందర్, శ్రీను, అజ్గర్, కృష్ణ, అరుణలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.వెంకన్న, ఎస్కే.రఫీ, ప్రభాకర్, లాల్ చందర్, అజ్మత్, భీమ పాల్గొన్నారు.

రామోజీరావు మృతి పట్ల సంతాపం


మహబూబాబాద్ టౌన్, జూన్ 8 : అక్షర యోధుడు, పద్మవిభూషన్ అవార్డు గ్రహీత చెరుకూరి రామోజీరావు మృతిపట్ల ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ శనివారం తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈనాడు దినపత్రికను స్థాపించి ప్రజా చైతన్యానికి నాంది పలికిన అక్షర యోధుడు రామోజీరావు అని చెప్పారు. రామోజీరావు మృతి జర్నలిజం, సినిరంగానికి తీరని లోటన్నారు. వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

● రామోజీరావు మృతిపట్ల మహబూబాబాద్ కమ్మ సంఘం జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. మహబూబాబాద్ పట్టణంలో శనివారం సంఘ సమావేశాన్ని నిర్వహించి రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మట్టూరి నాగేశ్వర్‌రావు, నామ సైదులు, కోశాధికారి సీహెచ్.రాజేష్, రావూరి మాధవరావు, ప్రభాకర్, శ్రీను, నర్సింహారావు, సీతారామారావు, ప్రశాంత్, లెనిన్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● పత్రికారంగంలో నూతన ఒరవడిని సృష్టించి అగ్రభాగాన నిలిచిన వ్యక్తి రామోజీరావు అని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లో నిర్వహించిన సం ఘం సమావేశంలో రామోజీరావుకు నివాళులర్పించారు. లక్ష్మీకాంతరావు, బొద్దుపల్లి పాయ్య, నీలం వెంకటేశ్వర్లు, కేవీఆర్. నర్సింహా, గణేష్, రంజాన్, వెంకటయ్య, అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

'బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి'

● డీఈవోకు టీఎస్-యూటీఎఫ్ నేతల వినతి


డీఈవో రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న టీఎస్-యూటీఎఫ్ నేతలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 8 : జిల్లాలో ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగానిర్వహించాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల, బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు షెడ్యూల్ విడుదల చేసినందున జిల్లాలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పదోన్నతులకు చేపడుతున్న సర్టిఫికెట్ల పరిశీలనలో భాగంగా అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయుల పదోన్నతుల్లో వెరిఫికేషన్స్ సీనియారిటీ లిస్టు తయారీ, ఖాళీల వివరాలను పారదర్శకంగా చేపట్టాలన్నారు.

సమాజ తిరోగమన శక్తులను తిప్పికొట్టాలి

కురవి, జూన్ 8 : సమాజ అభివృద్ధికి శాస్త్రీయ ఆలోచనలు అవసరమని, సమాజ తిరోగమన శక్తులను తిప్పికొట్టాలని ప్రజానాట్యమండలి రాజకీయ విద్యావిభాగం రాష్ట్ర బాధ్యులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. కురవి మండలం తట్టుపల్లిలో జరుగుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొన్ని మూఢత్వశక్తులు శాస్త్రీయ ఆలోచనలను మళ్లించడం కోసం సమాజంపై ప్రభావం చూపిస్తున్నాయని, తిరోగమన శక్తులను తిప్పికొట్టేందుకు శాస్త్రీయ ఆలోచనలను విస్తృతం చేయాలన్నారు. ఒకేజాతి, ఒకే మతమంటూ కొన్ని పార్టీలు ప్రజలపై మూఢత్వ ఆలోచనలు రుద్దే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. మతతత్వ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూఢత్వ ఆలోచనలను తిప్పికొట్టాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంద్, కార్యదర్శి కట్ట నర్సింహా, ఉపాధ్యక్షులు నాగభూషణం, సహాయ కార్యదర్శి వినోద్‌కుమార్, సదానంద్, ముత్యాలు, జిల్లా అధ్యక్షుడు నక్క సైదులు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కొమ్ము శ్రీను, ఉప్పలయ్య, మరస వెంకన్న, హరిత, ఎల్లమ్మ, నూనె శ్రీను పాల్గొన్నారు.

బడిగంటకు వేళాయే.. పనులు కాకపాయే.!

● నత్తనడకన ఏఏపీసీల వర్క్‌లు

● అడ్వాన్సులు ఇచ్చినా పూర్తికాని వైనం


చింతగూడెంలో పాఠశాల

గంగారం, జూన్ 8 : ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే స్కూళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బడుల్లో సకల వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల (ఏఏపీసీ) పనులు మండలంలో నెమ్మదిగా సాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే..

మహబూబాబాద్ జిల్లాలో 436 ఏఏపీసీ పాఠశాలలను ఎంపిక చేశారు. అయితే గంగారం మండలం నీతి అయోగ్ కింద ఎంపిక కావటంతో గంగారం మండలం నుంచి కూడా మొదటివిడతగా పదమూడు పాఠశాలలను గుర్తించారు. స్కూళ్లకు మార్చి నెలలోనే జిల్లా డీఆర్‌డీఏ ద్వారా వీవో (మహిళ)లను ఎంపిక చేసి, ఆయా పాఠశాల హెచ్ఎంలతో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ తీర్మానాల ప్రకారం మండలానికి మంజూరైన పదమూడు పాఠశాలల్లో మంచినీటి సరఫరా, విద్యుత్, పాఠశాల మరమత్తులు, మరుగుదొడ్డి మరమతులు, బాలికల మరుగుదొడ్లు ఇలా ఐదురకాల పనులకు అవసరమైన నిధులను ట్రైబల్‌వెల్ ఫేర్ ఇంజనీరింగ్ అధికారులచే అంచనాలు వేయించి, వాటిని పూర్తి చేసేబాధ్యతలను సదరు అధికారులకే అప్పగించారు.

ఈ పనులు చురుకుగా చేసేందుకు ఆయా కమిటీ చైర్మన్ (వీవో) ఎకౌంట్‌లో ఇరవై అయిదు శాతం నిధులు కూడా జమ చేశారు. జూన్ నాటికి ఆ కమిటీలు వారికి కేటాయించిన పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు ఏఏపీసీ పనులపై మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారులపర్యవేక్షణ లేకపోవటంతో పనులు పూర్తి కాలేదు. ఈ పనుల పురోగతిపైకలెక్టర్ ఆరా తీయటంతో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఇటీవల ఉరుకులు పరుగుల మీద గంగారం వచ్చి పురోగతిని పరిశీలించారు. మండలంలోని పదమూడు పాఠశాలల్లో పనులన్నీ మందకొడిగా సాగుటంపై ఆయా పాఠశాల ఉపాధ్యాయులను మందలించినా ప్రయోజనం లేదు. మరో వారం రోజుల్లో బడులు తెరచుకోనున్నాయి. ఈయినా పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉండటంతో విద్యార్థుల తల్లి తండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ విషయంపై ట్రైబల్‌వెల్‌ఫేర్ ఏఈ శోభన్‌ని వివరణ కోరగా.. ఏఏపీసీ పథకంలో మూడు పాఠశాలలు మాత్రమే పూర్తయ్యాయి అన్నారు. ఈ పనులు చేసేందుకు కూలీలు దొరక్క పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. త్వరలో అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.


వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పండిట్, వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 8 : జిల్లా కేంద్రంలోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం శనివారం తొలిరోజు వ్యాయామ ఉపాధ్యాయులు, తెలుగు, హిందీ పండిట్ల సర్టిఫికెట్లను పరిశీలించారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో వ్యాయామ ఉపాధ్యాయులు-50, తెలుగు పండిట్‌లు-120, హిందీ పండిట్‌లు-120 పాల్గొన్నట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ, వెంకటేశ్వర్లు, రాందాస్, రవి, ఫరూక్, కోట్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సర్టిఫికెట్లను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

చేపలు పిరం

మహబూబాబాద్ టౌన్, జూన్8 : ఎండకాలంలో రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయన్నది ఎంత నిజమో.. మృగశిర కార్తె రోజున చేపలు తినాలనే నానుడి అనాదిగా వస్తోంది. సూర్యుడు మృగశిర నక్షత్రంలో ప్రవేశించిన సమయంలో తొలకరి జల్లులు కురుస్తాయి. దీన్నే మృగశిర కార్తెగా పేర్కొంటారు. ఏటా వర్షాకాలం కూడా ఈ కార్తెతోనే ఆరంభమవుతుంది. శనివారం మృగశిరకార్తె ప్రవేశించడంతో అందరూ చేపల కొనుగోళ్లకు మొగ్గు చూపారు. దీంతో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మహబూబాబాద్‌కు చెందిన మత్స్య వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, తెలంగాణలోని నల్లగొండ, కోదాడ లాంటి ఇతర ప్రాంతాల నుంచి చేపలను దిగుమతి చేశారు. వాటి ధర రోజువారి కంటే రెట్టింపు అయినప్పటికి కొనుగోళ్లకు ఎవరూ వెనుకాడలేదు.

పెరిగిన ధరలు..

మానుకోట పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా మృగశిర కార్తె రోజున చేపల ధరలు పెరిగాయి. శనివారం జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్‌లోనే కాకుండా పట్టణంలోని రైల్వే ఏ-క్యాబిన్ రోడ్, నర్సంపేట బైపాస్, నిజాం చెరువుప్రాంతాల్లో వ్యాపారులు చేపలను విక్రయించారు. వాటికి డిమాండ్ భారీగా పెరగడంతో ఒక్కరోజులోనే ధరలు రెట్టింపు అయ్యాయి. గతంలో బొచ్చెలు, రవ్వ, గ్యాసకట్లు, బంగారుతీగ, పులసచేపలు కిలో రూ.150కు విక్రయిస్తే.. శనివారం మృగశిర కార్తె రోజున వాటి ధర రూ.200 పలికింది. చేపల్లో రారాజు కొర్రమీను గతంలో రూ.350 కిలో ఉంటే దానిని రూ.500 వరకు విక్రయించారు. రొయ్యలు గతంలో రూ. 300లు ఉండగా, రూ.500లకు విక్రయించారు. రోజూ సాధారణంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 15 నుంచి 20 క్వింటాళ్ల చేపలను మాత్రమే విక్రయిస్తే, ఈ ఒక్క రోజే 50 టన్నుల (500 క్వింటాలు) చేపలను అమ్మినట్లు వ్యాపారులు తెలిపారు. పల్లెల్లో ఇప్పటికే చెరువులు లూటీ కావడంతో మహ బూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి వ్యాపారులు చేపలను కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించారు. మానుకోట పట్టణంలో 500 క్వింటాళ్లు, గ్రామాల్లో మరో 200 క్వింటాళ్లు మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 700 క్వింటాళ్ల చేపలను విక్రయించినట్లు వ్యాపారులు తెలిపారు.

మృగశిర రోజున చేపను ఎందుకు తింటారంటే..

వేసవి కాలంలో వచ్చే రోహిణీ కార్తెలో రోకళ్లు పగిలే మండుటెండలు పోయి.. మృగశిరకార్తె ప్రారంభంతో తొలకరి జల్లుపడి భూమి మెత్తబడి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతోంది. 15 రోజులపాటు ఉండే ఈ మృగశిర కార్తె అంతా చల్లటి వాతావరణం ఉంటుంది. వేసవి కాలంలో కొట్టిన ఎండలతో శరీరాలు ఎండవేడిమి నుంచి ఒక్కసారిగా చల్లటి వాతావరణంలోకి రావడంతో ఈ చేపలు తినడం వల్ల శరీరంలోని ఉష్ణోగ్రతలు క్రమబద్ధంగా ఉంటాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. అలాగే వాతావరణంలో స్వల్ప మార్పులు రావడంతో అస్తమా, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఈ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడడానికి చేపల కూరను తింటారు. చేపలు తినడం వల్ల పోషకాలు అంది జీర్ణశక్తి పెరగడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతోందని చెబుతారు.

ఠాణా ఎదుట మృతుడి బంధువుల రాస్తారోకో

● న్యాయం చేయాలని డిమాండ్


పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సబ్‌స్టేషన్‌తండావాసులు

కేసముద్రం, జూన్ 8 : మండలంలోని పెనుగొండ క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలోని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌తో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై సబ్‌స్టేషన్ తండాకు చెందిన గిరిజనులు బైఠాయించారు. లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న తండాకు చెందిన గుగులోత్ వీరన్న మృతి చెందగా తాజామాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్న తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తండాకు చెందిన పలువురు యువకులు, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని, కూలీ పనిచేసుకొని జీవించే నిరుపేద అయిన మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేసముద్రం-వరంగల్ రహదారిపై బైఠాయించారు. పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ పోలీస్ డౌన్, పోలీస్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అరగంటకుపైగా రాస్తారోకో కొనసాగడంతో రహదారికి రువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని, చట్టరీత్యా చర్యలు తీసుకొని బాధితునికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతుడి బంధువులు మహబూబాబాద్‌కు వెళ్లి వీరన్న మృతదేహాన్ని సబ్‌స్టేషన్‌తండాకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

తొలకరి పలకరింపుతో తగ్గిన ఉష్ణోగ్రతలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 8 : జిల్లాలో కురుస్తున్న చిరుజల్లుల (తొలకరి పలకరింపు)తో ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నారు. రోహిణి కార్తె ఆరంభంలో కొట్టిన ఎండతో రోకళ్లు పగిలే విధంగా ఒక్కసారిగా 44 డిగ్రీలకుపైగా నమోదైన ఉష్ణోగ్రతలు వారం రోజు ల కిందటి నుంచి వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అప్పుడప్పుడు పడుతున్న వర్షాలతో ఉష్ణోగ్రతలు తగ్గి చల్లబడడంతో ప్రజలు కాస్త ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. రోహిణికార్తె ప్రారంభంతో వర్షాకాలం ప్రారంభమవుతుంది. ఇక నుంచి ఎండలు పూర్తిగా తగ్గి వర్షాలు పడుతాయని భావిస్తున్నారు. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే జూన్ 1న అత్యల్పంగా 29.6 డిగ్రీలు, అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరుసటి రోజు జూన్ 2 నుంచి కాస్త తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. అదేరోజు అత్యల్పంగా 29.2, అత్యధికంగా 40.8, జూన్ 3న అత్యల్పంగా 22.9, అత్యధికంగా 41.4, జూన్ 4న అత్యల్పంగా 26.0, అత్యధికంగా 38.7, జూన్ 5న అత్యల్పంగా 26.3, అత్యధికంగా 40.2, జూన్ 6న అత్యల్పంగా 24.2, అత్యధికంగా 41.5, జూన్ 7న అత్యల్పంగా 22.7, అత్యధికంగా 39.5, తాజాగా శనివారం అత్యల్పంగా 25.1, అత్యధికంగా 38.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక నుంచి ఉష్ణోగ్రతలు రోజు వారీగా మరింత తగ్గనున్నాయి.

వెయిట్‌లిఫ్టింగ్ కమిటీలో డోర్నకల్ వాసులకు చోటు

డోర్నకల్,జూన్ 8 :తెలంగాణ రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్‌లో ఇటీవల ఎన్నుకున్నారు. ఈ అసోసియేషన్‌లో డోర్నకల్‌కు చెందిన మండలోజు కృష్ణమూర్తికి అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, డోర్నకల్ పట్టణానికి చెందిన ఎం.సుధాకర్‌ను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అసోసియేషన్‌లో డోర్నకల్ వాసులకు చోటు కల్పించడం పట్ల భారత్ వీర్ వ్యాయామశాల సభ్యులు బుట్టి అశోక్, రాంచందర్, లక్ష్మీనారాయణ, కృష్ణ, సురేష్, లక్ష్మణ్‌లు హర్షం వ్యక్తం చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పంటల సేద్యం, వర్షాల రాకకోసం ప్రత్యేక యాప్‌లు

● సాగుకోసం ప్లాంటెక్స్, వర్షాలకు మేఘ్‌దూత్, దామిని..

● వర్షాకాలంలో ఉపయోగం అంటున్న నిపుణులు

తొర్రూరు, జూన్ 8 : ప్రపంచమంతా 'ఆన్‌లైన్' యాప్‌ల ద్వారానే కొనసాగుతుందంటే అతిశయోక్తి కాదు. నచ్చిన తిండి తినాలన్నా, మెచ్చిన ప్రదేశానికి వెళ్లాలన్నా మొబైల్‌లో సంబంధిత యాప్‌లను తెరిస్తే చాలు క్షణాల్లో వివరాలు అందుబాటులోకి వస్తున్నాయి. కూర్చున్న చోటు నుంచే పెట్టుబడులు, కొనుగోళ్లు, విద్య, ఉద్యోగ అవకాశాలు, చివరికి వివాహాలు కూడా ఆన్‌లైన్ మాట్రిమోని యాప్‌ల ద్వారా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి మార్పులు, వర్షాలు, పిడుగులు, మెరుపులు వచ్చే సమయం, ప్రాంతాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా యాప్‌ల ద్వారా తెలుసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అలాగే పంటల సాగు, తెగుళ్ల నివారణను రైతులు సులభంగా యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రభుత్వం గతంలోనే ఈ యాప్‌లను అందుబాటులోకి తెచ్చినా రైతులు, ప్రజలకు అవగాహన కొరవడి వినియోగంలోలేవు. నేడు రైతులు ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే వారే యువ రైతులు కూడా ఉన్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా అందే ముందస్తు సమాచారంతో జాగ్రత్త పడవచ్చు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ యాప్‌లను వినియోగించుకుంటే మేలు జరుగుతుందని ఆయా రంగాల నిపుణులు తెలుపుతున్నారు.

వర్షాలు, మెరుపుల జాడ తెలుసుకోవచ్చు



చేతిలో సెల్‌ఫోన్ ద్వారా మెరుపుల హెచ్చరికలు, పిడుగులతో వచ్చే ప్రమాదాలను మేఘ్‌దూత్, దామిని యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ రెండు యాప్‌లు కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖ రూపొందించింది. మేఘ్‌దూత్ యాప్ ద్వారా సమగ్ర వాతావరణ పరిస్థితులు, ఏరోజు ఏ ప్రాంతం లో వర్షం కురుస్తుంది. ఎంత వర్షాపాతం నమోదవుతుంది. గాలిలో తేమ, గాలి వీచే దిక్కులు, ఉష్ణోగ్రత తదితర వాతావరణ సమాచారం నిరంతరం అప్‌డేట్ అవుతుంది. అంతేకాక వారం రోజుల ముందు రానున్న 4 రోజుల వాతావరణ పరిస్థితులను ఈ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. దామిని యాప్‌తో మెరుపు హెచ్చరికలను ముందుగా పసిగట్టవచ్చు. ఎక్కడైనా మెరుపులు వచ్చే అవకాశాలు ఉన్నాయో లొకేషన్ ఆధారంగా చూపెడుతుంది. మెరుపులతో వచ్చే ప్రమాదాలతో జాగ్రత్తలు తీసుకోవచ్చు. పిడుగులు ఎందు కు పడతాయి. పడినపుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, గాయపడిన వారికి ముందస్తు చికిత్సలు దామిని యాప్‌లో లభిస్తాయి.

పంటల కోసం ప్లాంటెక్స్

పంటల సాగు, జాగ్రత్తలు, దిగుబడి తదితర రైతులకు సంబంధించిన సమగ్ర సమాచారం ప్లాంటిక్స్ యాప్‌లో లభిస్తుంది. ఇక్రిశాట్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన ఈ ప్లాంటిక్ యాప్ రైతులకు ఒక వరం లాంటిదని వ్యవసాయ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. పండ్ల తోటలు, పప్పు దినుసులు, కూరగాయలు, వరి తదితర పంటల సాగు విధానం, సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులు, తదితర వివరాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీంతో పాటు వాతావరణ పరిస్థితులను కూడా తెలుసుకోవచ్చు. పంటలకు సోకే తెగుళ్లు, చీడపీడలు, నివారణ పోషక లోపాలు సోకిన ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వాడాల్సిన మందులు, ఎరువులు, ఇతర వివరాలను కూడా యాప్ వివరిస్తుందని వ్యవసాయ రంగ నిపుణులు తెలుపుతున్నారు. యాప్‌లో కమ్యూనిటీ ఆప్షన్‌లోకి వెళితే వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు సహచర రైతుల అనుభవాలను సందేహాలను తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లన్నీ స్మార్ట్‌ఫోన్‌లో లభిస్తాయి.

రైతులకు ఎంతో ఉపయోగం

శోభన్‌బాబు, డివిజనల్ వ్యవసాయాధికారి

నేటి ఆధునిక యుగంలో రైతుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన మేఘ్‌దూత్, దామిని, ప్లాంటిక్స్ యాప్‌లు ఎంతో ఉపయోగపడతాయి. ప్రతి ఒక్క రైతు స్మార్ట్ ఫోన్ వాడుతున్న నేపథ్యంలో ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగించుకుంటే పంట దిగుబడులను పెంచుకోవచ్చు. ఇతరులపై ఆధార పడకుండా మంచి అవగాహన కలుగుతుంది.

'పుస్తకాల విక్రయాలను ఆపాలి'

తొర్రూరు, జూన్ 8 : ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ సామాన్ల విక్రయాలు నిలిపివేయాలని కోరుతూ శనివారం స్టేషనరీ వ్యాపారులు జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం బాధ్యులు మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులు విక్రయాలు చేపట్టవద్దని, విక్రయాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాలు కొనాలని మెసేజ్‌లు పెడుతూ వాట్సాప్ గ్రూప్‌లలో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొన్ని పాఠశాలల యాజమాన్యాలు హుకుం జారీ చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారులు శోభన్, ఉప్పలయ్య, వెంకట్, సూరిబాబు, వసంత్, చారి, సోమసుందర్ ఉన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

తొర్రూరు, జూన్ 8 : ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేస్తూ, బదిలీ, ప్రమోషన్లను పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి అన్నారు. శనివారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, పీఆర్సీ ఏరియర్స్, సరెండర్ బిల్స్, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ పీఆర్సీ కమిటీ నివేదికను త్వరగా పూర్తిచేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, మినిమం స్కేల్ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ రెడ్డి, చంద్రప్రకాశ్, చంద్రమౌళి, యాకయ్య, శ్రీనివాస్, రమేష్, హరికృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.



హరిపిరాల గ్రామ జీపీకి ఫ్రీజర్ బాక్స్‌ను అందచేస్తున్న మాజీ సర్పంచ్ రావుల మమతారెడ్డి

జీపీకి ఫ్రీజర్ బాక్స్ అందచేత

తొర్రూరు రూరల్, జూన్ 8 : మండలంలోని హరిపిరాల గ్రామ పంచాయతీకి మాజీ సర్పంచ్ రావుల మమతారెడ్డి ఫ్రీజర్ బాక్స్‌ను శనివారం గ్రామ పంచాయతీ ఆవరణంలో పంచాయతీ కార్యదర్శి దేవయ్యకు అందజేసి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలు ఫ్రీజర్ బాక్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతుండగా వారి సమస్యను పరిష్కరించడానికి రూ.70వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అధికారం, పదవి ఉన్నలేకపోయిన ఎల్లప్పుడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, ఎంపీటీసీ వల్లపు గోపమ్మమల్లయ్య, నారాయణ, సదాకర్ పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలను పెంచాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీరస్వామి

గార్ల, జూన్ 8 : మండలంలోని పౌరసరఫరాల శాఖ గిడ్డంగిలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి చార్జీలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు అంబటి వీరస్వామి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పౌరసరఫరాల గిడ్డంగి కార్యాలయం ఎదుట శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడ్డంగిలో పనిచేస్తున్న కార్మికులు వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నారని, దీనికి ప్రభుత్వం రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందునూరి శ్రీనివాస్, సర్వయ్య, మదార్ పాల్గొన్నారు.

వైద్యుల పనితీరుపై మండిపాటు

గంగారం, జూన్ 8 : కోమట్లగూడెం పీహెచ్‌సీ వైద్యులు వారి తీరుపై జడ్పీటీసీ ఈసం రమా మండిపడ్డారు. వైద్యుడితో పాటు ఇతర సిబ్బంది విధులకు హాజరు కాకుండా డుమ్మా కొడుతున్నారని వచ్చిన పిర్యాదులపై ఆమె పీహెచ్‌సీతో పాటు సబ్ సెంటర్లను తనిఖీ చేశారు. 24గంటల పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు తప్ప ఎవరు ఉండటంలేదని ఆమె ఆరోపించారు. మారుమూల గ్రామాలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది గత కొంత కాలంగా విధులకు రావటంలేదని దీంతో అత్యవసర సమయంలో వైద్యం అందక గిరిజనులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆమె ఆరోపించారు. సబ్ సెంటర్లలో కూడా ఉండాల్సిన హెల్త్ అసిస్టెంట్లు హాజరు కావటంలేదని ఆమె ఆరోపించారు. వైద్యునితో పాటు సిబ్బంది వారి పనితీరు మార్చుకుని రానున్న వర్షాకాలంలో జ్వరాలు రాకుండా గిరిజనులకు అందు బాటులో ఉండి వైద్య సేవలందించకపోతే జిల్లా కలెక్టర్‌కి పిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

● బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెయిన నాగమణి

గార్ల, జూన్ 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి విజ్ఞప్తి చేశారు. శనివారం మహిళ మోర్చా ఆధ్వర్యంలో అస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గార్లలో పేరుకే పెద్దఆస్పత్రి ఉందని, 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా స్థానికంగా ఉండేలా ఉన్నతాధికారులు అందుబాటులో ఉండా లన్నారు. ఈ కార్యక్రమంలో జంపాల శ్రీను, అజ్మీర సుమలత, అజ్మీర రాము, దేవానాయక్, వీరస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమాస్టర్‌పై విచారణ

గూడూరు, జూన్ 8 : విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన పొనుగోడు బ్రాంచ్ పోస్టు మాస్టర్ (బీపీఎం) సువర్ణపాక శరత్‌బాబుపై విచారణ చేపడు తున్నట్లు నర్సంపేట ఐపీవో సుచేందర్ తెలిపారు. గూడూరు పోస్టాఫీసులో శనివారం సబ్‌పోస్టు మాస్టర్ (ఎస్పీఎం) ఉపేందర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొనుగోడు శివారు టీకులతండాకు చెందిన ఉపాధి హామీ కూలీల డబ్బులను గతనెల 24న రూ.99, 823లను డ్రాచేశాడు. సదరు డబ్బులను కూలీలకు చెల్లించలేదు. దీంతో కూలీలు ఎస్పీఎం ఉపేందర్‌కు పిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఐపీవో సుచేందర్ విచారణ చేపట్టారు. ఈ విచారణకు సంబంధిత బీపీఎం హాజరు కాలేదని అధికారి తెలిపారు.

గతంలో బొల్లెపల్లి బీపీఎం సస్పెండ్?

బొల్లెపల్లి గ్రామానికి చెందిన బీపీఎం అజ్మీర కిరణ్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను సంబంధిత ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొల్లెపల్లిలోని ఉపాధి హామీ కూలీల డబ్బులు రూ.3.45 లక్షలను పోస్టాఫీసు ద్వార డ్రా చేశారు. కూలీలకు చెల్లిస్తున్న సమయంలో సంబంధిత అధికారులు తనిఖీ చేపట్టగా రూ.1.10 లక్షలు మాత్రమే బీపీఎం కిరణ్ వద్ద ఉండడంతో మిగ తావి ఏమయ్యాయని అతన్నిప్రశ్నించారు. సరైన సమా ధానం రాకపోవడంతో ఈనెల 2న రూ.3.45 లక్షల నగదును అతని వద్ద నుంచి రికవరీ చేసి సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతన్ని సస్పెండ్ చేసినట్లు ఎస్పీఎం ఉపేందర్ తెలిపారు.

విత్తన దుకాణాల తనిఖీ

కేసముద్రం, జూన్ 8 : కేసముద్రంలో విత్తనాలను విక్రయించే దుకాణాలను మండల వ్యవసాయాధికారి (ఎంఏవో) బి.వెంకన్న శనివారం తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాకులను, రిజిష్టర్లను, బోర్డులను పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. డీలర్లు విత్తనాలు విక్రయించిన సమయంలో తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని షాపుల యజమానులను ఆదేశించారు.